ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 27 జూలై 2024



అందుబాటులో ఇసుక ధర

కలెక్టరేట్, జూలై 26: కొనుగోలుదారులకు ఇసుక ధర అందుబాటులో ఉంచాలని భూగర్భ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా.. కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని, రవాణా ఛార్జీలు మాత్రమే తీసుకోవాలని తెలిపారు. భూగర్భ గనుల శాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ జిల్లాల వారీగా ఇసుక నిల్వ, వార్షిక డిమాండ్ కార్యచరణను వివరించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ స్టాక్‌యార్డులో ప్రస్తుతం 46వేల టన్నుల ఇసుక నిల్వ ఉందని, డీ-సిల్టింగ్ త్వరలోనే చేస్తామన్నారు. రవాణా ఛార్జీలు తీసుకుంటున్నట్లు వివరించారు.

వారిలో వణుకు!





- నాడు-నేడు పనులపై సీఐడీ ఫోకస్
- వైసీపీ నాయకుల్లో అలజడి
- సహకరించిన అధికారుల్లో ఆందోళన
- నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు
- త్వరలో దర్యాప్తునకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

వైసీపీ ప్రభుత్వ పాలనలో ఆ పార్టీ బడాస్థాయి నేతల నుంచి గ్రామస్థాయి చోటా నాయకుల వరకూ అక్రమాలకు పాల్పడ్డారు. వారి అక్రమాలకు కొంతమంది అధికారులు కూడా సహకరించారు. గత ఐదేళ్లలో 'నాడు-నేడు' పేరిట రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను అభివృద్ధి చేసినట్టు వైసీపీ నేతలు గొప్పలు చెప్పుకున్నారు. ఓటర్ల మెప్పు పొందేందుకు సార్వత్రిక ఎన్నికల ప్రచారంలోనూ దీనిపై ప్రసంగాలు చేశారు. కాగా.. 'నాడు-నేడు' అభివృద్ధి పనుల పేరిట భారీగా అక్రమాలు జరిగాయని ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వం భావిస్తోంది. సీఐడీ దర్యాప్తు ద్వారా ఈ అక్రమాలను బయటకు తీసేందుకు సన్నద్ధమవుతోంది. దీంతో అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకుల్లో అలజడి రేగుతోంది. అప్పట్లో వైసీపీ నాయకులతో అంటకాగి.. నిబంధనలు విస్మరించి.. సామగ్రి విషయంలో సంబంధం లేనట్లు వ్యవహరించిన అధికారుల్లోనూ ఆందోళన నెలకొంది.



ఆమదాలవలస నియోజకవర్గంలో ఓ ప్రభుత్వ పాఠశాలకు సరఫరా చేసిన నాణ్యత లేని గ్రానైట్

● జిల్లాలో ఇదీ పరిస్థితి..

గత ప్రభుత్వం 'నాడు-నేడు'లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో రన్నింగ్ వాటర్, కిచెన్ షెడ్, విద్యుత్ సదుపాయం, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టింది. అలాగే మైనర్, మేజర్ రిపేర్లు, కాంపౌండ్ వాల్, తాగునీటి సదుపాయం, పెయింటింగ్, గ్రీన్ చాక్‌బోర్డు, ఫర్నీచర్ వంటివి సమకూర్చింది. జిల్లాలో ఫేజ్-1లో 958 ప్రభుత్వ పాఠశాలలకుగాను రూ. 246,72,32,000 ఖర్చుచేశారు. ఫేజ్-2లో రూ.445,34,54,000 పనులు ప్రతిపాదించారు. కానీ ప్రస్తుతానికి 1,058 ప్రభుత్వ పాఠశాలలు, 38 జూనియర్ కళాశాలల్లో పనులు చేపట్టినందుకు రూ.175.26 కోట్లు ఖర్చు చేశారు. పనులు ఇంకా పూర్తికాలేదు. కొన్ని పాఠశాలలు బాగుచేసినా.. మదింపు పేరిట మూసివేశారు. కాగా.. 'నాడు-నేడు' పేరిట అభివృద్ధి పనుల్లో నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలపై విచారణ చేపట్టాలని ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో పలువురు ఎమ్మెల్యేలు కోరారు. దీనిపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ... 'నాడు-నేడు' పనులపై త్వరలో సీఐడీ దర్యాప్తు చేయిస్తామని ప్రకటించారు. దీంతో వైసీపీ నాయకులు, అక్రమాలకు సహకరించిన అధికారుల్లో టెన్షన్ నెలకొంది.

● పేరు పేరెంట్స్ కమిటీది.. పెత్తనం మరొకరిది..

పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో 'నాడు-నేడు' పనులు జరగాల్సి ఉన్నా.. పేరుకు మాత్రమే కమిటీ అన్నట్లు వైసీపీ ప్రభుత్వం వ్యవహరించింది. పనులను స్థానిక వైసీపీ నాయకులు తీసుకుని నిర్వహించారు. ఇందులో స్థానిక నాయకుల కంటే.. వైసీపీ బడానేతలు.. భారీగా లబ్ధి పొందారన్న ఆరోపణలు ఉన్నాయి. పనులు చేపట్టినట్లు ఇంజనీరింగ్ అధికారులు పేరెంట్స్ కమిటీ నుంచి సంతకాలు సేకరించేవారు. కానీ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న ఫర్నిచర్, పెయింట్స్, గ్రానైట్ పలకలు.. ఇటువంటివన్నీ గత ప్రభుత్వ పెద్దలు స్పష్టంచేసిన వాటినుంచే కొనుగోలు చేసేవారు. తెలివిగా పేరెంట్స్ కమిటీ నుంచి ఆర్డర్లు తీసుకున్నారు.. కానీ అంతిమంగా లబ్ధిపొందింది అప్పటి వైసీపీ పెద్దనాయకులే. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు గ్రానైట్ పలకల సమకూర్చే అనధికార కాంట్రాక్టులో వైసీపీ ఎమ్మెల్సీకి లబ్ధి కలిగింది. నాసిరకమైన పలకలు.. పాఠశాలలకు సరఫరా చేసి.. బిల్లులు మాత్రం రంచన్‌గా తీసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సీఐడీ రంగంలోకి దిగితే.. ప్రభుత్వ పాఠశాలలకు ఐదేళ్లలో సరఫరా చేసిన రంగులు, గ్రానైట్, ఫర్నిచర్.. ఇలా తెరవెనుక ఉన్న నాయకుల బాగోతం బట్టబయలవుతుంది.

● వారిని పక్కన పెడితేనే.. సమగ్ర విచారణ..

ప్రభుత్వ కార్యక్రమాల్లోని అక్రమాల్లో అప్పటి నాయకుల పాత్ర ఎంతుందో.. అదేస్థాయిలో అధికారులదీ ఉంది. బిల్లుల రికార్డు చేయడం నుంచి.. వారికి సహకరించి.. 'పీసీ'ల రూపంలో తీసుకున్న అధికారులు.. వారితో పాటు.. పెద్దఎత్తున ఆరోపణలు 'మూట'కట్టుకున్న అధికారి కూడా ప్రస్తుతం జిల్లాలోనే కొనసాగుతున్నారు. ఇటువంటివారిని పక్కనబెట్టి.. లేదంటే మరోచోటుకు బదిలీచేసి.. సీఐడీ దర్యాప్తు ఆరంభిస్తే గతప్రభుత్వ తప్పిదాలు మొత్తం వెలుగులోకి వచ్చే అవకాశముంది. అప్పట్లో ఉన్నత పదవులు వెలగబెట్టిన బడానేతల అక్రమాల చిట్టా సైతం.. బయటపడనుంది. దీనిపై జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు దృష్టి సారించి.. సమగ్ర విచారణకు చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమానికి కృషి

● నూతన జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

కలెక్టరేట్, జూలై 26: 'ప్రజా సమస్యల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారిస్తా. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి చేస్తా'నని నూతన జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం ఉదయం 10గంటలకు జేసీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, ప్రతీ వారం డివిజన్, మండలస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తొలుత నెల్లూరులో ట్రైనీ కలెక్టర్‌గా పనిచేశారు. అనంతరం రాజంపేటలో సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. తర్వాత అన్నమయ్య జిల్లా జేసీగా పనిచేస్తూ బదిలీపై జిల్లాకు వచ్చారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన జేసీకి జిల్లా అధికారులు, తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న దృశ్యం

ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు కౌన్సెలింగ్

● తొలిరోజు 469 మంది విద్యార్థుల హాజరు

ఎచ్చెర్ల, జూలై 26: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ) శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని పీయూసీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. సీటు పొందిన విద్యార్థులు ఉదయం 7గంటలకే క్యాంపస్‌కు చేరుకున్నారు. ఆర్జీయూకేటీ సెట్ అడ్మిషన్లు-2024 కన్వీనర్ డాక్టర్ ఎస్. అమరేంద్రకుమార్ కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు టోకెన్‌లు అందజేసి, సర్టిఫికెట్లను పరిశీలించారు. కుల, అకడమిక్ ధ్రువపత్రాల పరిశీలన, ఫీజు చెల్లింపు, సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చడం, సర్టిఫికెట్ల సేకరణకు వేర్వేరుగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి గుర్తింపు కార్డులను, ధ్రువీకరణ పత్రాలను అడ్మిషన్ల సెట్ కన్వీనర్‌తో పాటు క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ అందజేశారు. ఈ సందర్భంగా అడ్మిషన్ల కన్వీనర్ అమరేంద్రకుమార్ మాట్లాడుతూ 'ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ల్లో ఈ నెల 22న ప్రారంభమైన ప్రవేశాల కౌన్సెలింగ్ శనివారంతో ముగుస్తుంది. మిగులు సీట్ల వివరాలను ఇదే రోజు సాయంత్రం వెల్లడిస్తాం. ఇప్పటికే దరఖాస్తు చేసిన విద్యార్థుల మెరిట్ జాబితా ప్రకారం మిగులు సీట్ల భర్తీకి ఆగస్టు రెండో వారంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. తర్వాత తరగతులు ప్రారంభిస్తాం. గతంతో పోలిస్తే ఈ ఏడాది అన్ని కేటగిరీల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి పోటీ తీవ్రమైంది. ఆర్జీయూకేటీలోని నాలుగు క్యాంపస్‌ల పరిధిలో 4,400 సీట్లు ఉండగా 4140 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 93శాతం, ప్రైవేటు పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 7 శాతం సీట్లు కేటాయించాం. ఇందులో బాలికలు 67 శాతం, బాలురు 33శాతం ఉన్నారు. ఫీజు రాయితీ లేని విద్యార్థులు పీయూసీ 1,2 సంవత్సరాలకు రూ.45వేలు చొప్పున, ఇంజినీరింగ్‌లో ఒక్కో ఏడాదికి రూ.50వేలు చొప్పున చెల్లించాలి' అని తెలిపారు. క్యాంపస్ ప్రవేశాల కో-ఆర్డినేటర్ గోవర్ధన్ మాట్లాడుతూ 'తొలిరోజు 515 మందిని కౌన్సెలింగ్‌కు ఆహ్వానించగా 469మంది హాజరయ్యారు. శనివారం 521మంది విద్యార్థులను కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంద'న్నారు. కార్యక్రమంలో క్యాంపస్ ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, కో-ఆర్డినేటర్ కె.రమణ, పీఆర్వో మామిడి షణ్ముఖ పాల్గొన్నారు.

భారతదేశంలో పుట్టడం గర్వకారణం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- కార్గిల్ అమర సైనికులకు నివాళి



కార్గిల్‌లో పాల్గొన్న సైనికుడ్ని సన్మానిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్, జూలై 26: 'భరతమాత ముద్దుబిడ్డలుగా నేటి యువత ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలి. ఈ దేశంలో పుట్టడం మనకు గర్వకారణమ'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కార్గిల్ విజయ దివస్ సందర్భంగా శుక్రవారం స్థానిక సైనిక సంక్షేమ కార్యాలయంలో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు.

జిల్లాలోని మాజీ సైనికులు, వారి కుటుంబాల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తగిన పరిష్కారం చేస్తామన్నారు. కార్గిల్ యుద్ధంలో దివ్యాంగులుగా మారిన ఇద్దరు మాజీ సైనికులను కలెక్టర్ సన్మానించి నగదు పురస్కారాలతో సత్కరించారు. కార్గిల్ యుద్ధంలో అసమాన ధైర్య, సాహసాలను ప్రదర్శించిన సైనిక యోధుల వీరత్వాన్ని కొనియాడారు. కార్గిల్ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఇతర మాజీ సైనికులను కూడా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సైనికులు, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది, ఇతర ఆహ్వానితులు పాల్గొన్నారు.

పరిశ్రమలపై కలెక్టర్ ఆరా

కలెక్టరేట్, జూలై 26: జిల్లాలోని ఏయే ప్రాంతాల్లో ఏ పరిశ్రమలు ఉన్నాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎంఎస్ఎంఈ, చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమల వివరాలపై ఆరా తీశారు. ఆయా పరిశ్రమల్లో ఉత్పత్తులు, ఉపాధి అవకాశాల వివరాలను తెలుసుకున్నారు. ఏజెన్సీలోని పరిశ్రమలు, పరిశ్రమల స్థాపనకు రుణాల మంజూరు, కేంద్ర పథకాలు ఇచ్చే సబ్సిడీపై చర్చించారు. డీఐపీసీలో పెండింగ్ దరఖాస్తులపై ఆరా తీయగా.. 41 ఉన్నాయని ఎల్డీయం సూర్యకిరణ్ తెలిపారు. ఏపీఐఐసీలో ఉన్న సమస్యలను డీజెడ్ఎం పాండురంగారావు వివరించారు. రాష్ట్రం ద్వారా సబ్సిడీపై ఇచ్చే పథకాలు, మహిళలకు, ఎస్సీ, ఎస్టీ లకు ఇచ్చే సబ్సిడీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పీఎం విశ్వకర్మ పథకంలో భాగంగా ఇప్పటి వరకూ 7,138 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఉమామహేశ్వరరావు, ఏడీలు రమణారావు, రఘునాథ్, ఏపీఎంఐపీ డీడీ శ్రీనివాసరావు, ఇండస్ట్రీయల్ ప్రమోషన్ అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల, జూలై 26: పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో శుక్రవారం నిర్వహించిన పరేడ్‌ను పరిశీలించి.. సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించనున్నట్టు చెప్పారు. శారీరక, మానసిక ఒత్తిడిని ఎదుర్కొనేందుకు వ్యాయామానికి ప్రతిరోజు కొంత సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, డీఎస్పీలు ఎల్.శేషాద్రి, జి.శ్రీనివాసరావు, సీఐ అవతారం తదితరులు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

జీడి గోదాముపై జీఎస్టీ అధికారుల దాడులు

● ఇది కక్షపూరితమంటున్న వ్యాపారి

పలాస, జూలై 26: స్థానిక జీడి బ్రోకర్ సిందిరి శ్రీనివాస్(ఎక్సలెంట్ క్యాజూ సప్లయర్స్) గోదాముపై శుక్రవారం జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ (విజయనగరం) కె.వెంకటరమణ ఆధ్వర్యంలో అధికారులు సోదాలు చేశారు. గోదాములో 750కిలోల జీడిపప్పు మాత్రమే ఉన్నట్లు గుర్తించి.. ప్రాథమిక తనిఖీ చేశారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ వెంకటరమణ విలేకరులతో మాట్లాడుతూ సాధారణ తనిఖీలు చేశామన్నారు. ఏటా జీడివ్యాపార సంస్థల రికార్డులు పరిశీలించాల్సి ఉంటుందన్నారు. బ్రోకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇవి కక్ష పూరితంగా చేసిన దాడులేనని ఆరోపించారు.

● ఈ ఏడాది జనవరిలో కాశీబుగ్గ జీఎస్టీ కార్యాలయంలో ఏసీటీవో స్థాయి అధికారి కిషోర్‌కుమార్ ఏసీబీ దాడిలో అడ్డంగా బుక్కయ్యారు. బ్రోకర్ శ్రీనివాసరావుకు సంబంధించి రూ.18లక్షల నగదు వ్యాపారి అకౌంట్‌కు రావాల్సి ఉంది. దీనికి భారీ మొత్తం డిమాండ్ చేయడంతో వాటిని ఇచ్చేందుకు ఇష్టం లేని శ్రీనివాస్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో పక్కా ప్రణాళికతో జీఎస్టీ అధికారి కిషోర్‌కుమార్‌ను పట్టుకున్నారు. తాజాగా బ్రోకర్ గోదాంలో జీఎస్టీ అధికారులు సోదాలు చేయడం చర్చనీయాంశమవుతోంది. జీఎస్టీ అధికారుల తీరుపై వ్యాపారులు కూడా మండి పడుతున్నారు. అధికారులు మాత్రం ఇవి సాధారణ తనిఖీలేనని చెబుతుండడం గమనార్హం.



గోదాములో సోదాలు చేస్తున్న జీఎస్టీ అధికారులు

జిల్లాలో రైతుల సంఖ్య	సాగుచేసే భూమి	2014-19 మధ్య రైతులకు లబ్ధి	2019-24 మధ్య రైతులకు లబ్ధి
5,25,912 మంది	6,47,504 ఎకరాలు	రూ.360 కోట్లకుపైగా..	రూ.90 కోట్లు

పంటల బీమా.. రైతులకు ధీమా

- అన్నదాతలందరికీ ఇన్సూరెన్స్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం
- వైసీపీ పాలనలో అన్నీ నష్టాలే



(టెక్కలి)

పంటల బీమాతో రైతులకు భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతులు నిండా మునిగారు. విపత్తులు, అతివృష్టి, అనావృష్టి ప్రభావంతో తీవ్రంగా నష్టపోయారు. గత ఐదేళ్లలో జిల్లాలో 94,500 మంది రైతులకు సుమారు రూ.90కోట్లు మాత్రమే బీమా సొమ్ము చెల్లించి మమ అనిపించారు. ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వం.. ప్రకృతి విపత్తులతో పంట దెబ్బతిన్న రైతులను బీమాతో ఆదుకోవాలని సంకల్పించింది. ఆ దిశగా సోమవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఏ రైతుకు నష్టం జరగకూడదని, ప్రతి రైతునూ ఆదుకోవాలని నిర్ణయించారు. విపత్తుల సమయంలో రైతులకు న్యాయం చేసేలా బీమా అమలుపై చర్చించారు. త్వరలో విధివిధానాలు ఖరారు చేయనున్నారు.

● 2014-19 కాలంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు సంబంధించిన పంటలకు అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ కంపెనీలతో బీమా చేయించారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చర్యలు చేపట్టారు. ఒకరకంగా ఆ ఐదేళ్లు రైతులకు స్వర్ణయుగమే. పంటలు ఏరకంగా దెబ్బతిన్నా ఆదుకోవడమే తరువాయి. ఫైలాన్, హుద్‌హుద్, తితలీ వంటి తుఫాన్లే కాకుండా దోమపోటుతో నష్టపోయిన సందర్భంలో కూడా రైతులకు పంట నష్టపరిహారం అందించారు. , మరోవైపు పెట్టుబడి సాయం, దోమపోటు నష్టానికి కూడా పరిహారం ఇచ్చారు. అన్నీ కలిపి ఐదేళ్లలో సుమారు రూ.360కోట్లు పైగా చెల్లించారు.

● 2019-2024లోని వైసీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా అని చెప్పి ప్రైవేట్ బ్యాంకులకు అప్పగించారు. కొంతమంది రైతులకు ప్రీమియం చెల్లించకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. కేవలం గత ఐదేళ్లలో జిల్లా రైతులకు రూ.90 కోట్ల మేర మాత్రమే లబ్ధి దక్కింది. ఈ సారి కూటమి ప్రభుత్వం.. అందరికీ బీమా కల్పించేలా చర్యలు చేపట్టడం శుభపరిణామం అని పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దిక్సూచి DIKSUCHI

ఓయూ కళాశాలల్లో బీఈ/బీటెక్ లేటరల్ ఎంట్రీ

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ)- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. యూనివర్సిటీ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజ్ సహా వర్సిటీ అనుబంధ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రతి కళాశాలలో స్పెషలైజేషన్‌కు 30 సీట్లు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.



ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు ఉంటాయి. వారాంతాలు, సెలవు రోజుల్లో కూడా అందరి సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని క్లాసెస్ నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000. వర్సిటీ నిబంధనల మేరకు ఇతర ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.

అర్హత: ఏదేని గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. చేరదలచుకున్న ఇంజనీరింగ్ కాలేజీకి 100 కి.మీ.ల పరిధిలో ఉన్న కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు, ఎంఎస్ఎంఈ పరిశ్రమలు/సంస్థల్లో పని చేస్తూ ఉండాలి. కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి.

ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో స్పెషలైజేషన్‌కు సంబంధించి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 36 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 15 శాతం మార్కులు రావాలి. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 27
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** డిప్లొమా సర్టిఫికెట్-మార్కుల పత్రాలు, టీసీ, మైగ్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పదోతరగతి సర్టిఫికెట్, ఆరోతరగతి నుంచి డిప్లొమా వరకు స్టడీ సర్టిఫికెట్లు, సర్వీస్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, జిరాక్స్ కాపీలు, రెండు ఫొటోలు.
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఆగస్టు 4
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 8
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 17
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 24
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/7kP3x2Cలో చదవండి.

కోటక్ కన్య స్కాలర్‌షిప్

కోటక్ మహీంద్రా గ్రూప్ కంపెనీలు, కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'కోటక్ కన్య స్కాలర్‌షిప్ 2024-25' నోటిఫికేషన్ వెలువడింది. ప్రతిభావంతులైన బాలికలను ఉన్నత విద్యలో ప్రోత్సహిస్తూ వారికి ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కాలర్‌షిప్‌ను ఉద్దేశించారు. కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండో తరగతి పూర్తిచేసి గుర్తింపు పొందిన కాలేజీల్లో ఇంజనీరింగ్/మెడిసిన్/బీడీఎస్/ఫార్మసీ/ఆర్కిటెక్చర్/డిజైనింగ్ విభాగాల్లో డిగ్రీ ప్రవేశం పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ, బీఎస్సీ నర్సింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరినవారు; బెంగళూరు ఐఐఎస్సీ, ఐసర్ సంస్థల నుంచి ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్ అడ్మిషన్ పొందినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.6 లక్షలు మించకూడదు. ఎంపికైన బాలికలకు ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ఇంటర్నెట్, ల్యాప్‌టాప్, బుక్స్, స్టేషనరీ ఖర్చుల కింద ఏడాదికి రూ.లక్షన్నర ఇస్తారు. వార్షిక పరీక్షల్లో కనీసం 6 సీజీపీఏ సాధించేవారికి కోర్సు పూర్తయ్యేవరకూ స్కాలర్‌షిప్ కొనసాగిస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.kotak.com, www.b4s.in/it/kkgs2

పోటీ నీకే - జయం నీదే

కొత్త పుస్తకం

పోటీ పరీక్షలు అంటే గ్రామీణ యువతలో విపరీతమైన క్రేజ్ ఉంటుంది. అయితే వీరిలో ఎక్కువ మంది గ్రూప్స్, టీచర్ వంటి ఉద్యోగాల పట్ల దృష్టిపెడతారు కానీ సివిల్స్ గురించి ఆలోచించరు. రాయాలని ఉన్నా అవి పెద్ద పెద్ద పట్టణాల్లో చదువుకున్నవారికి లేదా టాప్ ర్యాంకర్లకు ఉద్దేశించిన ఉద్యోగాలని భావిస్తుంటారు. అలాంటి వారికి మార్గనిర్దేశం చేసేందుకు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రావులపాటి సీతారామారావు 'పోటీ నీకే - జయం నీదే' పేరుతో పుస్తకం రాశారు.

ఏదో పనిమీద బయటకు వెళ్లినప్పుడు తనను కలిసిన విద్యార్థులు, ఉద్యోగార్థులు పలు సందేహాలు వెలిబుచ్చేవారు. తను వారికి ఇచ్చిన గైడెన్స్ అందరికీ చేరాలనే ఉద్దేశంతో రచయిత ఈ పుస్తకం రాశారు.

విజయం సాధించాలంటే పెద్ద బ్యాక్‌గ్రౌండ్ ఉండాల్సిన పనిలేదు. ఒక గమ్యాన్ని నిర్దేశించుకుని, దాని కోసం క్రమపద్ధతిలో కష్టపడాలని చెబుతారు. పోటీ పరీక్షల కోసం ప్లానింగ్ ఎలా చేసుకోవాలి? ఎన్ని గంటలు చదవాలి? పరీక్షల కోసం సిద్ధమయ్యే వారికి మెంటార్ అవసరమా? అని చెబుతూ తనతో సహా గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు సివిల్స్ వంటి పరీక్షల్లో ఎలా విజయం సాధించారో స్ఫూర్తి కలిగించేలా సవివరంగా చెప్పారు సీతారామారావు. పరీక్షలు రాసే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని అధిగమించిన తీరును పుస్తకంలో వివరించారు.

పరీక్షలకు సిద్ధంకావడానికి ముందే అకడమిక్ పరీక్షలకు, పోటీ పరీక్షలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా గ్రహించగలగాలి. చదువుకోవడానికి మూడ్ ఉండాలి, వారం-వర్జం లాంటివి చూసుకోవాలనే మూఢనమ్మకాలు దరిచేరనీయ వద్దు. లక్ష్యం పెద్దగా నిర్ణయించుకున్నప్పుడు అందుకు అనుగుణంగానే ప్రిపేర్ కావాలి అని చెబుతారు. సెల్ఫ్ మోటివేషన్ పొందడానికి ఏమి చేయాలి? కొంత మంది సివిల్స్ అభ్యర్థులు ఎలా మోటివేట్ అయ్యారు అని వివరించారు. ఇవి సివిల్స్ అభ్యర్థులకు మాత్రమే కాకుండా అన్ని పరీక్షల విద్యార్థులకు ఉపయోగపడతాయి. ఈ పుస్తకాన్ని సాహితి ప్రచురణలు వారు ప్రింట్ చేశారు.

వెల: రూ.90/-
ప్రతులకు: సాహితి ప్రచురణలు 33-22-2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ-520 002.
ఫోన్: 8121098500



నవ్య | చిత్రజ్యోతి

ఆ పాటలో కేసీఆర్‌ను తలుచుకున్నామంతే!





రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోని 'మార్ ముంతా ఛోడ్ చింతా' పాట వివాదంపై సంగీత దర్శకుడు మణిశర్మ స్పందించారు. ఆ పాటలో 'ఇప్పుడేం చేద్దాం' అంటూ కేసీఆర్ అన్న మాటను ఉపయోగించడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహించాయి. ఇటీవల ఇచ్చిన ఈ పాట గురించి ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూలో మణిశర్మ వివరణ ఇస్తూ 'సోషల్ మీడియాలో వచ్చే మీమ్స్ ఆధారంగా ఆ పాట ఉంటుంది. కేసీఆర్ అంటే అందరికీ గౌరవం. ఆయన సరదాగా చెప్పిన ఓ పదాన్ని ఇందులో తీసుకున్నామంతే. ఎవరినీ నొప్పించడం మా ఉద్దేశం కాదు. నా 27 ఏళ్ల కెరీర్‌లో ఎవరినీ నొప్పించలేదు. ఆ పాటలో కేసీఆర్‌ను ఒకసారి తలచుకున్నాం. కేవలం అది వినోదం కోసమే. దయచేసి అందరూ అలాగే భావించండి' అన్నారు. 'డబుల్ ఇస్మార్ట్' లోని మూడో పాట 'క్యా లఫ్డా' ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రామ్, హీరోయిన్ కావ్యా థాపర్ పోస్టర్ రొమాంటిక్‌గా ఉంది. ఆగస్టు 15న 'డబుల్ ఇస్మార్ట్' విడుదల కానుంది.

మనవడి స్కూలుకు రజనీ



పాఠశాలకు వెళ్లేందుకు మారాం చేసిన తన మనవడిని తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ స్వయంగా స్కూల్‌కు తీసుకెళ్ళి వదిలిపెట్టారు. మనవడితో కారులో రజనీ స్కూల్‌కు వెళుతున్న ఫోటోను ఆయన చిన్న కుమార్తె సౌందర్య శుక్రవారం సామాజికా మాధ్యమాల్లో షేర్ చేస్తూ.. 'ఈ రోజు నా కుమారుడు స్కూల్‌కు వెళ్ళనని మొండికేయడంతో వాడి సూపర్ హీరో తాత (రజనీ) పాఠశాలకు స్వయంగా తీసుకెళ్లారు. వెండితెర అయినా, నిజజీవితంలో అయినా ఎలాంటి పాత్రనైనా నా తండ్రి అద్భుతంగా పూర్తి చేస్తారు' అని పేర్కొన్నారు. కాగా, సౌందర్య కుమారుడు వేద్‌ను పాఠశాల తరగతి గదిలోకి తీసుకెళ్ళిన రజనీకాంత్‌ను ఇతర పిల్లలు సంభ్రమాశ్చర్యాలతో చూశారు. వెండితెరవేల్పు రజనీ తమ కళ్లముందు ప్రత్యక్షమవ్వడంతో వారి ఆనందానికి హద్దే లేకుండాపోయింది. ఇదిలావుంటే, 'వేట్టయాన్' సినిమా పూర్తి చేసిన రజనీకాంత్ ఇపుడు లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో గ్యాప్ లభించడంతో ప్రస్తుతం ఆయన స్థానిక పోయెస్ గార్డెన్‌లో ఉన్న తన నివాసంలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు.
ఆంధ్రజ్యోతి, (చెన్నై)

షారుక్ ఖాన్ రూ.40 కోట్లు.. అమితాబ్ రూ.30 కోట్లు...

అనంత్ అంబానీపై సినీ సెలెబ్రిటీల కానుకల వర్షం...




ఆభరణాల సెట్
అమితాబ్ బచ్చన్ దంపతులు, అభిషేక్, ఐశ్వర్య కలసి ఈ వధూవరులకి రూ.30 కోట్ల విలువైన ఆభరణాల సెట్‌ను (పచ్చల హారాన్ని) బహుమతిగా ఇచ్చారు.



ఇటీవలే అంగరంగ వైభవంగా జరిగిన అనంత్ అంబానీ, రాధిక మర్చంట్‌ల వివాహం.. ప్రపంచవ్యాప్తంగా జరిగిన అత్యంత ఖరీదైన పెళ్లిల్లో ఒకటిగా నిలిచిపోయింది. ఈ చిరకాల వేడుకకు అంబానీ కుటుంబం చేసిన హంగామాని ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారు. ఆకాశంలో చంద్రుడు చుట్టూ ఉన్న అసంఖ్యాక తారల్లా.. అంబానీ పెళ్లిలో అనేక రంగాల్లోని అగ్ర తారలందరూ సందడి చేసి దేదీప్యమానంగా వెలుగులు విరబూశారు. ఈ విలాసవంతమైన పెళ్లికి అదిరిపోయే రేంజ్‌లో అత్యున్నతమైన ఏర్పాట్లకు తోడు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ తారలు హాజరవడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకకు వచ్చిన కొందరికి అంబానీ కుటుంబం అతిథి మర్యాదలతో దాదాపు రూ.రెండు కోట్ల విలువ చేసే వాచీలను గిఫ్ట్‌గా ఇచ్చారు. అలాగే సినీ సెలబ్రిటీలు కూడా ఈ కొత్త జంటకు కానుకలు అందించడానికి క్యూ కట్టడం విశేషం. మిగతా పరిశ్రమల నటీనటులు ఏయే బహుమతులు ఇచ్చారో తెలియదు కానీ.. బాలీవుడ్ తారలు ఇచ్చిన బహుమతుల వివరాలు ఒక్కొక్కటే బయటకు వస్తున్నాయి. ఎవరు ఏమేమిచ్చారో ఇప్పుడు తెలుసుకుందాం.



రూ.40 కోట్ల విల్లా
బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ ఈ నూతన జంటకు ఫ్రాన్స్‌లో రూ.40 కోట్లు ఖరీదు చేసే ఓ విలాసవంతమైన భవంతిని కానుకగా ఇచ్చారు.



రూ.20 కోట్ల రోల్స్ రాయిస్
'కల్కి 2898 ఏ.డీ'తో తెలుగువారికి చేరువైన దీపికా పదుకొనే, తన భర్త రణ్‌వీర్ రూ.20 కోట్లు పెట్టి ఓ రోల్స్ రాయిస్ కారును వెడ్డింగ్ ప్రజంటేషన్‌గా ఇచ్చారు.



రూ.15 కోట్ల బైక్
సల్మాన్ ఖాన్ రూ.15 కోట్ల విలువైన స్పోర్ట్స్ బైక్‌ను కానుకగా ఇచ్చారు.

రూ.తొమ్మిది కోట్ల మెర్సిడెస్
రణ్‌బీర్ కపూర్, అలియా భట్ జంట ఈ కపుల్‌కు రూ.తొమ్మిది కోట్ల విలువైన మెర్సిడెస్ కారును గిఫ్ట్‌గా ఇచ్చారు.









వీరితో పాటు, అక్షయ్ కుమార్ రూ.60 లక్షలు విలువ చేసే బంగారపు పెన్నును.. సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అద్వానీ దంపతులు రూ.25 లక్షలు విలువ చేసే హ్యాండ్ మేడ్ శాలువాను.. విక్కీకౌశల్, కత్రినా కైఫ్ దంపతులు రూ.19 లక్షల బంగారు గొలుసును బహూకరించారు.

మూడేళ్ల కష్టం.. కమిటీ కుర్రోళ్లు



అంతా కొత్తవారితో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం హీరో సిద్దు జొన్నలగడ్డ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చిన్న సినిమా, పెద్ద సినిమా అని ఉండదు. ఓ సినిమాకు ఎక్కువ ఖర్చు పెడతాం, మరో చిత్రానికి తక్కువ ఖర్చు పెడతాం.. తేడా అంతే. ఈ సినిమాలో విజువల్స్ బాగున్నాయి. కొత్తవారితో ఇంత మంచి చిత్రం తీయడం మాములు విషయం కాదు. దర్శకుడు యదు వంశీకి ఇదే మొదటి సినిమా అంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఈ సినిమా హిట్ అయి అందరికీ లాభాలు తేవాలి' అని కోరారు. చిత్ర సమర్పకురాలు నిహారిక మాట్లాడుతూ 'మూడేళ్ల కష్టం ఈ సినిమా. వీరంతా మూడేళ్లుగా పని చేస్తునే ఉన్నారు. అంతా కష్టపడి మంచి సినిమా చేశాం. ఆగస్టు 9న సినిమాను విడుదల చేస్తున్నాం' అని చెప్పారు. 'మా సినిమాలో నటించిన 11 మంది సిద్ధులాగా ఎంతో కష్టపడుతుంటారు. మా టెక్నికల్ టీమ్ సపోర్ట్‌తో సినిమాను బాగా తీయగలిగాను. నిహారిక, ఫణి లేకపోతే చిత్రం ఇలా వచ్చేదే కాదు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ సహకారం మరువలేనిది' అని చెప్పారు దర్శకుడు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తీసిన యూత్‌ఫుల్ మూవీ ఇదని నిర్మాత ఫణి అడపాక, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ చెప్పారు.

సస్పెన్స్ థ్రిల్లర్



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటించిన చిత్రం 'జ్యువెల్ థీఫ్' సీనియర్ నటి ప్రేమ కీలక పాత్ర పోషించారు. పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఇటీవలే సినిమా టీజర్‌ని, ఆడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'నేను సూపర్‌స్టార్ కృష్ణగారి అభిమానిని. ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. ఈ తరం ప్రేక్షకులకు నచ్చే సస్పెన్స్ థ్రిల్లర్. త్వరలోనే విడుదల చేస్తాం' అని చెప్పారు.

'పావలా' శ్యామలకు సాయి దుర్గతేజ్ ఆర్థిక సాయం



ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న సీనియర్ నటి 'పావలా' శ్యామలకు హీరో సాయి దుర్గతేజ్ ఆర్థిక సాయం చేశారు.. తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యుల ద్వారా శ్యామలకు లక్ష రూపాయలు పంపించారు. శ్యామల ఎమోషనల్ అయి 'మా అమ్మాయికి ఆపరేషన్ అయినప్పుడు సాయి దుర్గతేజ్ ఫోన్ చేసి, ధైర్యం చెప్పారు. వచ్చి కలుస్తానన్నారు. చాలా రోజులైంది. మరిచిపోయారేమో అనుకున్నా. గుర్తు పెట్టుకుని సాయం చేసినందుకు ధన్యవాదాలు' అన్నారు.

వాణిజ్య హంగులతో విరాజి



వరుణ్ సందేశ్ కథానాయకుడిగా ఆద్యంత్ హర్ష తెరకెక్కించిన చిత్రం 'విరాజి'. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మీడియాతో ముచ్చటించారు. 'గతంలో మా సంస్థలో వరలక్ష్మి శరత్‌కుమార్‌తో 'శబరి' చిత్రాన్ని నిర్మించాం. మేం నిర్మించిన రెండో చిత్రం 'విరాజి'. వరుణ్ సందేశ్ కొత్తలుక్‌లో కనిపిస్తారు. ఆయన గెటప్‌కు కథలో ప్రాధాన్యం ఉంది. మన సమాజంలోని ఒక అంశాన్ని తీసుకొని కమర్షియల్ కోణంలో సినిమాను తెరకెక్కించాం' అని మహేంద్రనాథ్ చెప్పారు.

ప్రధాన కాలువల్లో వ్యర్థాలు తీసేందుకు నిధులు

● మున్సిపాలిటీలకు రూ.99.90 లక్షలు కేటాయింపు

పలాస: జిల్లాలో మున్సిపాలిటీల్లో మురుగు కాలువల్లో పేరుకు పోయిన వ్యర్థాలు తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.99.90 లక్షల నిధులు కేటాయించింది. పట్టణాల్లో మురుగునీటి కాలువలు అస్తవ్యస్తంగా ఉండడం, చెత్త పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో వర్షాలు కురిసిన సమయంలో తరచూ ఇబ్బందులు తలెత్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో పనులు చేపట్టేందుకు ఇంజనీరింగ్ అధికారులు నిమగ్నమయ్యారు. వీటికి సంబంధించిన పనుల వివరాల ప్రతిపాదనలను తయారు చేసి అమరావతిలోని మున్సిపల్ ప్రధాన కార్యాలయానికి పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో మున్సిపా లిటీలకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. కేంద్రం ఇచ్చిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు, మున్సిపాలిటీల జనరల్ ఫండ్స్‌తోనే కాస్తో కూస్తో అభివృద్ధి పనులు చేపట్టారు. జరిపారు. నిధులు లేకపోవడంతో కాలువల పరిస్థితి దయ నీయంగా తయారైంది. ఏమాత్రం వర్షం కురిసినా కాలువల్లోని మురుగునీరు రోడ్లపై ప్రవ హించి ప్రజలు అవస్థలు పడ్డారు. ఈ విషయాన్ని గుర్తించిన పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ ముందుగా కాలువల్లో వ్యర్థాలు తీసేందుకు ప్రాధాన్యం ఇచ్చి సీఎంతో చర్చించి నిధులు కేటాయించారు. ఈ మేరకు జిల్లాలో ఉన్న ఇచ్ఛాపురం మున్సిపాలిటీకి రూ.27.25 లక్షలు, పలాస-కాశీబుగ్గకు రూ.42.94 లక్షలు, ఆమదాలవలసకు రూ.29.71 లక్షలు మంజూర య్యాయి. వీటి పనులు మూడు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది.


పలాస శివారున ప్రధాన కాలువలో ఉన్న వ్యర్థాలు

కోడూరు-మగతపాడు పంచాయతీలను ఆదుకోండి

● మంత్రిని కోరిన ఎమ్మెల్యే బగ్గు, నాయకులు

నరసన్నపేట, జూలై 26: పోలాకి మండలం కోడూరు-మగతపాడు పంచాయతీల్లో నాలుగేళ్లుగా నిధులు మంజూరుకాక అభివృద్ధి చెందలేదని, ఆ పంచాయతీలను ఆదుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో పోలాకి, నరసన్నపేట మండలాల టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం అమరావతిలో మంత్రి అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలాకి మండలం కోడూరు-మగతపాడు పంచాయతీల్లో సర్పంచ్ అధికారాలను రద్దు చేయడంతో నిధులు విడుదల కాలేదన్నారు. నిధులను వెంటనే విడుదల చేయాలనికోరారు. కార్యక్రమంలో కోడూరు సర్పంచ్ కె. రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బైరి భాస్కరరావు, నియోజవర్గ తెలుగు యువత నాయకులు తంగి తారకేశ్వరరావు, రావాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి, నాయకులు

తల్లికి వందనంలో 'ప్రైవేటు'కు స్థానంపై హర్షం

నరసన్నపేట: ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం అమ లు చేయనున్నట్లు మంత్రి మంత్రి నారా లోకేష్ ప్రకటించడంపై ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక పాఠశాలలో సీఎం, మంత్రుల చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నేరవేర్చిన కూటమి ప్రభుత్వం రుణం తీర్చుకోలేనదని సంఘ నాయకులు అన్నారు. పేదలకు ఉన్నత మైన విద్యను అందించేందుకు కూటమి ప్రభుత్వం చేయూత నిచ్చిందన్నారు. కార్యాక్రమంలో వెలమల భాస్కరరావు, ఈగల వేణుగోపాలరావు, మెట్ట జనార్ధనరావు, ఆర్.శ్రీనివాసరావు, ఇప్పిలి రవికుమార్, అసిరినాయుడు, బోర రామారావు పాల్గొన్నారు.


సీఎం, మంత్రుల చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న సంఘ నాయకులు

తక్షణం మరమ్మతులు చేపట్టాలి

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట సమీపంలో వంశధార నది ఒడ్డున ఏర్పాటు చేసిన రక్షిత నీటి పథకానికి తక్షణం మరమ్మతులు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నీటి పథకాన్ని పరిశీలించారు. రక్షిత నీటి పథకానికి సంబంధించి ట్యాంక్ నది ఒడ్డున ఉన్నందున ఏటా వస్తున్న నీటి తాకిడికి కోతకు గురై ఏ క్షణంలోనైనా పడిపోయే అవకాశం ఉందన్నారు. తక్షణం తగు చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్ శంకరరావుకు ఆదేశించారు. నదికి వరదలు వస్తే పనులు చేసే అవకాశం ఉండదని, అందువల్ల పనులు వేగవంతంగా చేయాలన్నారు.

మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ

పలాస: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 108 ఎమర్జన్సీ మెడికల్ టెక్నీషియన్లకు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా మేనేజర్ హరిప్రసాద్, జగన్నాథ రావు మాట్లాడుతూ.. క్లిష్ట సమయాల్లో సిబ్బంది విధులు, మందుల వినియోగం, అత్యవసర రోగులకు చేయాల్సిన సేవలను వివరించారు. పలాస, టెక్కలి డివిజన్లకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

జీవో 217 రద్దు పట్ల హర్షం

సంతబొమ్మాళి: సముద్రతీర చెరువులపై మత్స్యకారులకు హక్కులు లేకుండా వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 217ను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం హర్షణీయమని టీడీపీ మత్స్యకార నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ సూరాడ భీమారావు అన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో సమస్యను రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రద్దు చేయించారన్నారు. దీంతో ప్రభుత్వానికి, మంత్రి అచ్చెన్నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తుఫాన్ భవనాలను అందుబాటులో ఉంచాలి

హరిపురం: తుఫాన్ రక్షిత భవనాలు తీర ప్రాంత గ్రామ ప్రజలకు విపత్కర పరిస్థితుల్లో అందుబాటులో ఉండేలా చూడాలని పలాస ఆర్డీవో భరత్ నాయక్ అన్నారు. బేతాళపురం, రట్టి, గుంగువాడ, లక్ష్మీపురం, దున్నూరు, గెద్దూరు, సిగల పుట్టుగ గ్రామాల్లో రక్షిత భవనాలను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ.. భవనాల పరస్థితులను అడిగితెలుసుకున్నారు. మరమ్మ తులకు గురైన వాటిని తిరిగి పునరుద్ధించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్య క్రమంలో తహసీల్దార్ తిరుమలబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


రట్టి తుఫాన్ రక్షిత భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్

క్రీడల్లోనూ మార్పులు రావాలి

టెక్కలి: కాలానుగుణంగా జరిగే మార్పుల్లో క్రీడల్లోనూ మార్పులు రావాలని, తదను గుణంగా విద్యార్థుల కు తర్ఫీదు ఇవ్వాలని టెక్కలి ఉపవిద్యాశాఖాధికారి విలియమ్స్ అన్నారు. శుక్రవారం ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో డివిజన్ స్థాయి వ్యాయామోపాధ్యాయుల శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడల్ని అభివృద్ధి పరచాలన్నారు. జిల్లా వ్యాయామ విద్య అధ్యక్షుడు ఎంవీ రమణ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో క్రీడలు మూడంచెల విధానంలో నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో స్కూల్‌గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి బీవీ రమణ, ఎంఈవోలు దాసుపురం చిన్నారావు, సీహెచ్ ఫణికుమార్, జిల్లా క్రీడాశాఖాధికారులు మాధవరావు, కె.రాజారావు, పి.తవిటయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో

అమృత్ స్టేషన్‌గా నౌపడా రైల్వే జంక్షన్

టెక్కలి: అమృత్ స్టేషన్‌గా నౌపడా రైల్వే జంక్షన్ ఎంపికైంది. వికసిత్ ఆంధ్రా.. మోదీ ధ్యేయంలో భాగంగా రాష్ట్రంలో రైల్వే రంగ అభివృద్ధికి 73 స్టేషన్లు ఎంపిక చేయగా వాటిలో నౌపడా రైల్వే జంక్షన్ ఉండడం, ఈ బడ్జెట్‌లో పొందుపరచడంతో ఈ రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. మౌలిక సదుపాయాల కల్పన, ప్లాట్‌ఫారాలు, అప్పర్‌క్లాస్ వెయిటింగ్‌రూమ్ నిర్మాణం తదితర పనులను చేపట్టనున్నారు. నౌపడా రైల్వే జంక్షన్ నుంచి గుణుపూర్‌కి మార్గం ఉండడంతో ఇక్కడ డార్మెట్రీ సౌకర్యం, అదనంగా మరో ప్లాట్‌ఫారంతో పాటు రైళ్ల ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు ప్రయాణికులు తడవకుండా రూఫ్‌షెడ్ సౌకర్యం, రైలు బోగీలు నిలిచే సమాచారం అందించే ఎలక్ట్రానిక్ బోర్డు, రైళ్ల రాకపోకలు తెలిపే ఎలక్ట్రానిక్ బోర్డు, లిఫ్ట్ సౌకర్యం కల్పించాల్సి ఉంది.



ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

హరిపురం: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సుభాష్ కోరారు. మందస మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లోని పీఆర్సీ అమలు చేయాలని, 117 జీవో రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు గవ్వ భీమారావు, ఎస్ కిరణ్‌కుమార్, కె.సుందరరావు, ప్రసాద్, వైకుంఠ బెహరా, డిల్లేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై వినతి

టెక్కలి: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు శుక్రవారం మండల అధికారులకు వినతిపత్రం అందించారు. ఎంఈవో జి.నర్సింహులు, ఉపతహసీల్దార్ ఎన్.భాగ్యలక్ష్మి, ఎంపీడీవో టి.రాజారావులకు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.శంకరరావు ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందించారు. కె.కుమారస్వామి, వై.గణపతి, శివప్రసాద్ ఉన్నారు.

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం

కరకవలస(ఎల్.ఎన్.పేట): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం పీఆర్టీ యూతోనే సాధ్యమని ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కె. అమ్మి నాయుడు, బి.సుధాకరరావు అన్నారు. శుక్రవారం పలు పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపట్టారు. 117 జీవోను రద్దుచేయాలని, సీపీఎస్ రద్దుచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. సంఘ నాయకులు పి.అప్పలనాయుడు, జి.మహేశ్, ఎం.ముఖలింగం పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

హిరమండలం: హిరమండలం మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో స్వరూపరాణి తెలిపారు. ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన నిర్వహించు సమావేశానికి అన్ని శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

గొర్రిబంద ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా

జలుమూరు (సారవకోట): గొర్రిబంద ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దాసరి రాజేష్ శుక్రవారం రాజీనామా చేసినట్లు ఏపీవో నారాయణరావు తెలిపారు. ఇదివరలో రాజేష్ విధులకు రాకుండా వేతనదారులకు మస్తర్లు వేసి అక్రమాలకు పాల్పడ్డారని గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్వామా ఏపీడీ మురళీకృష్ణ ఈనెల 23న దర్యాప్తు నిర్వహించారన్నారు. దీంతో రాజేష్ రాజీనామా పత్రాన్ని ఎంపీడీవోకు సమర్పించినట్లు ఏపీవో తెలిపారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

పలాస: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని, దీనివల్ల ప్రమాదాలు జరిగే సమయాల్లో ప్రాణాపాయం నుంచి కాపాడుకోవచ్చని మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి యు.మాధురి అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శుక్రవారం సిబ్బందికి హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. మొదటిసారి హెల్మెట్ లేకుండా పట్టుబడితే అపరాధ రుసుం, రెండోసారి పట్టు బడితే మరో రకం అపరాధ రుసుం వేయడం జరుగుతుందన్నారు. వాహనం నడిపే వారంతా అపరాధ రుసుం చెల్లించే ఆలోచన నుంచి బయటపడాలన్నారు కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు ఎస్.విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఫయ్యాజ్ అహ్మద్, న్యాయవాదులు జీఎంఎస్.అనిల్‌రాజు, టీకే ఆర్ పట్నాయక్, ప్రభాకర్, రజనీ కుమార్, రవికుమార్, శ్యామ్, చిట్టిబాబు, ఆర్టీసీ డీఎం సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయాధికారి యు.మాధురి

మైనర్లు వాహనాలు నడిపితే నేరం

జలుమూరు: మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరమని ఎస్ఐ కె.మధుసూదనరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రైవింగ్‌పై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. లైసెన్సు లేకుండా వాహనం నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమో దు చేస్తామన్నారు. అలాగే రూ.25 వేలు వరకు జరీమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.వేణుగోపాలరావు, దుర్గాప్రసాద్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి బారిన పడొద్దు

పాతపట్నం: గంజాయి మహమ్మారిబారిన పడొద్దని సీఐ నల్లి సాయి అన్నారు. గంజాయి తదితర మాదక ద్రవ్యాల వినియోగాలకు వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పాతపట్నంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలి వద్ద మానవహారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నాయకుడు వెంకటరావు మాట్లాడుతూ.. ఒడిశా సరిహద్దు ప్రాంతమైన పాతపట్నంలో గంజాయితోపాటు ఖైనీ గుట్కా తదితర నిషేధిత ఉత్పత్తులు యథేచ్ఛగా జరుగుతున్నాయని, వీటిని పోలీసులు అడ్డుకోవాలని కోరారు. ఎస్ఐ మహమ్మద్ యాశిన్ మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగాలతో అనారోగ్యానికి గురై జీవిత మాధుర్యాన్ని అనుభవించేందుకు పనికిరాకుండా పోతారన్నారు. ఎక్కడ మాదకద్రవ్యాల వినియోగం జరుగుతున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కిరణ్మయి కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, ఏఐవైఎఫ్ నేతలు పాల్గొన్నారు.


పాతపట్నం మానవహారం నిర్వహించిన విద్యార్థినీ విద్యార్థులు

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా మారాలి

ఎల్.ఎన్.పేట: రాష్ట్రం డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా మారాలని, దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్ఐ బి.నిహార్ తెలిపారు. లక్ష్మీనర్సుపేట జంక్షన్‌లో శుక్రవారం స్థానికులకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కలిగించారు. డ్రగ్స్ వాడకం వల్ల ఆరోగ్యం చెడిపోవడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతారన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

రైల్వే అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో శ్రామిక్ కాంగ్రెస్ అభ్యర్థుల విజయం

పలాస: ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఖుర్దారోడ్ డివిజన్‌లో అర్బన్ బ్యాంకుకు ఆఫీస్ బ్యారర్ల ఎన్నికల్లో శ్రామిక్ కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. మూడు విభాగాల్లో వారి అభ్యర్థులు గెలుపొందడం విశేషం. 24, 25 తేదీల్లో పలాస రైల్వే స్టేషన్‌లో ఈ ఎన్నికలు జరిగాయి. ఇంజనీరింగ్ డిపార్టు మెంట్ నుంచి ఎల్.మోహనరావు, మెకానిక్ డిపార్ట్‌మెంట్ నుంచి ఎంఎస్.ప్రసాద్, ఆపరేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి డి.శ్యామసుందరరావు ఎంపికయ్యారు. శుక్రవారం ఎన్నికల ఫలితాలను అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపికైన ఉద్యోగులను శ్రామిక్ కాంగ్రెస్ నాయకులు ఎస్.రాజశేఖర్, వి.రామారావు, కె.హరిప్రసాద్, డి.రవి చౌదరి అభినందించారు.

విశాఖ డివిజన్ నుంచి చిరంజీవి..

పాతపట్నం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే విశాఖ డివిజన్ అర్బన్ బ్యాంక్ డెలిగేట్ ఎన్నికల్లో శ్రామిక యూనియన్ అభ్యర్థి కొల్ల చిరంజీవి విజయం సాధించారు. నౌపడ నుంచి గుణుపూర్ పరిధిలో పీడబ్ల్యూఐలు, గేట్‌కీపర్లు, ట్రాక్‌మన్, క్లర్క్‌లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రీకాకుళం ఎడాన్ టీవీఎస్ మూర్తి ఎన్నిక ధ్రువపత్రాన్ని చిరంజీవికి అంద జేశారు. ఈ సందర్భంగా చిరంజీవిని పలువురు రైల్వే ఉద్యోగులు అభినందించారు.

గడ్డి తీగెలను తొలగించారు



వజ్రపుకొత్తూరు: రిట్టపాడు గ్రామంలో విద్యుత్ స్తంభాలు, వైర్లకు అల్లుకుపోయిన గడ్డి తీగెలను తొలగించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రమాదకరంగా..' శీర్షికతో వచ్చిన కథనా నికి విద్యుత్ అధికారులు స్పందించి గడ్డి తీగెలను తొలగించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.

జయహో భారత్



నరసన్నపేట: ఒలింపిక్ క్రీడలల్లో భారత్ విజయఢంకా మోగించాలని కోరుతూ వైఎంసీఏ ఆధ్వర్యంలో శుక్రవారం విజయోస్తు ర్యాలీ నిర్వహించారు. పారిస్‌లో జరగనున్న క్రీడా పోటీల్లో భారత్ క్రీడాకారులు విజయ సాధించి దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలని వైఎంసీఏ అధ్యక్షులు, టీడీపీ పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి గొద్దు చిట్టిబాబు అన్నారు. క్రీడల్లో భారత్ రాణించాలని కోరుతూ క్రీడాకారులు నినదించారు. అలాగే కార్గిల్ వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. వారణాశి రమేష్‌తో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

మన్మథరావుకు రాష్ట్ర కళింగ సంక్షేమ సంఘంలో చోటు

పలాస: రాష్ట్ర కళింగ సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీగా చిన్నబడాం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు డిక్కల మన్మథరావును ఎంపిక చేశారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ నుంచి సమాచారం వచ్చింది. ఈయన ప్రస్తుతం కంచిలి గురు కుల పాఠశాలలో చిత్రలేఖనం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా సంఘ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



హిందీ ఉపాధ్యాయురాలి మృతి

టెక్కలి: పోలవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శుభప్రద శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందినట్లు సిబ్బంది తెలిపారు. గత కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శుభప్రద మృతి పట్ల హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.


శుభప్రద(ఫైల్)

ఆదిత్యలో నేడు పట్టభద్రుల దినోత్సవం

టెక్కలి: ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో 8వ పట్టభద్రుల దినోత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో బీటెక్, ఎంబీఏ కోర్సులు పూర్తిచేసిన 500 మంది విద్యార్థులకు పట్టాలు అతిథులు అందజేస్తారన్నారు.

30న శ్రీముఖలింగం హుండీల లెక్కింపు

జలుమూరు: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ ముఖలింగేశ్వరాలయంలో హుండీలను ఈనెల 30న లెక్కిస్తున్నట్లు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు హుండీని దేవదాయశాఖ అధికారులు సమక్షంలో తెరిచి లెక్కిస్తున్నట్లు తెలిపారు. అర్చకులు, గ్రామ పెద్దలు, పాల్గొనాలని కోరారు.

ఇంటర్ పాఠ్యపుస్తకాలు పంపిణీ

నందిగాం: రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను శుక్ర వారం పంపిణీ చేశారు. స్థానిక ఉన్నతపాఠశాల స్టాక్ పాయింట్‌లో ప్రభుత్వ జూనియర్ కళా శాల, కస్తూర్బా గాంధీ విద్యాలయం కళాశాలల అధ్యాపకులకు అందజేశారు. విద్యార్థులకు వీటిని అందించాలని ఎంఈవో జి.నర్సింహులు సూచించారు.

జగనన్న కాలనీ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టండి

పోలాకి: జగనన్న కాలనీ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని నర్సాపురం యువజన సం ఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సచివాలయం వద్ద సంబంధిత అధికారులను నిలదీశారు. అక్రమాల పై గతంలో అనేక పర్యాయాలు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎవరూ లేకపోవడం తో సచివాలయానికి వెళ్లి వీఆర్వో శ్రీనివాసరావును కలిసి సమస్యలను విన్నవిం చామని యువజననాయకులు శ్యామలరావు, పి.రామకృష్ణ, వెంకటి తెలిపారు. నర్సాపురంలో ఇచ్చిన జగనన్న కాలనీలో రికార్డుల్లో లేకుండా ఆరుగురు వ్యక్తులు కాలనీ ఇళ్లు ఎలా నిర్మిం చారని, ఎవరి ప్రోద్బలంతో చేపట్టారని ప్రశ్నించారు. రెవెన్యూ కార్యాలయంలో కాలనీ సమస్య ను ఎవరూ పట్టించుకోవడంలేదని సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా అక్రమంగా ఇళ్లు నిర్మించిన పునాదుల వద్ద బాధితులు, యువకులు నిరసన వ్యక్తంచేశారు.


అధికారిని నిలదీస్తున్న యువకులు

చెరువుల పరిశీలన

నందిగాం: దేవళభద్ర, జల్లపల్లిలో గుర్రపు డెక్కతో నిండిన చెరువులను శుక్రవారం అధికారులు పరిశీలించారు. గుర్రపు డెక్కతో సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అలాగే తాగునీరు కలుషితమవుతోందని గ్రామాల ప్రజలు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పండ్కర్‌కు ఇటీవల ఫిర్యాదుచేశారు. ఆయన ఆదేశాలతో ఉపాధి ఏపీడీ శైలజ, వంశధార టెక్కలి ఈఈ శేఖర్‌బాబు చెరువులను పరిశీలించి రైతులను సమస్య అడిగి తెలుసుకున్నారు. నర్సిపురం ఓపెన్ వెల్ నుంచి గ్రామస్థులకు రక్షిత పథకం ద్వారా తాగునీరు సరఫరా అవుతోందని, పద్మదల చెరువు కారణంగా నీరు కలుషితమై వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. రైతుల ఇబ్బందులను, గుర్రపుడెక్క తొలగింపునకు నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో ఎం.నాగరాజు, మళ్ల బాలకృష్ణ, ఎస్.దామోదరరావు పాల్గొన్నారు.

రేపు సాఫ్ట్‌టెన్నిస్ జూనియర్ జట్ల ఎంపిక

పాతపట్నం: స్థానిక మినీస్టేడియం సమీపంలో ఆదివారం సాఫ్ట్‌టెన్నిస్ జూనియర్ జట్ల ఎంపిక జరుగుతుందని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.అప్పన్న, జి.షణ్ముఖరావు తెలిపారు. 2006 తరువాత జన్మించిన క్రీడాకారులు ఈ పోటీలకు అర్హులన్నారు. శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు క్రీడాకారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 4, 5 తేదీలలో విజయవాడ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

ఉపాధి హామీ పనులపై వివరాల సేకరణ

కొమ్మువలస(ఎల్.ఎన్.పేట): ఉపాధిహామీ పథకంలో 2023-2024 సంవత్సరం లో జరిగిన పనులపై గ్రామాల్లో వేతనదారుల ఇళ్లకు వెళ్లి వివరాలను సేకరించి మండల కేంద్రంలో జరుగు సోషల్ ఆడిట్‌లో ప్రకటించనున్నట్లు ఏపీవో కెశ్రీదేవి తెలిపారు. కొమ్మువలస గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సోషల్ ఆడిట్ సిబ్బంది పరిశీలించి నాణ్యతా లోపాలను గుర్తించి నివేదికలు తయారు చేస్తారన్నారు. ఉపాధికూలీలకు పనులకు తగిన కూలి గిట్టుబాటు అవుతుందా లేదా అన్న విషయాలపై వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి సుశీల, పంచాయతీ కార్యదర్శి, ఎం.లావణ్య, పి.రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

పలాస: మున్సిపల్ పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌కు వినతిపత్రం అందిం చారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు మురుగన్, గౌరవాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.36 వేలు చెల్లించాలన్నారు. పారిశుధ్య కార్మికులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని, పనిచేసే చోట తాగునీరు, విశ్రాంతి మందిరాలు, దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలన్నారు.

పాము కాటుతో రైతు మృతి


త్రినాథరావు (ఫైల్)

జలుమూరు: పాగోడు పంచాయతీ వెలుసోద గ్రామానికి చెందిన గురువు త్రినాథరావు (58) పాము కాటుకు గురై గురువారం రాత్రి మృతి చెందారు. పొలంలో పని చేస్తుండగా పాము కాటు వేయడంతో వెంటనే కుటుంబ సభ్యులు నరసన్నపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించినట్టు వారు తెలిపారు. త్రినాథరావుకి భార్య అప్పమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కేజీబీవీలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

టెక్కలి: కోటబొమ్మాళి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతున్న బొడ్డాపు పూజ గురువారం రాత్రి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. కేజీబీవీలో చేరి ఇంటికి వెళ్లిన ఆమె గురువారమే తిరిగి వచ్చింది. రాత్రి భోజనాల తరువాత మేడ మొదటి అంతస్తుపైకి వెళ్లి అక్కడి నుంచి కిందకు దూకింది. గమనించిన తోటి విద్యార్థినులు సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఆమెను కోటబొమ్మాళి ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆమె కుడికాలు విరిగిపోయింది. సమాచారాన్ని టెక్కలి మండలం పరశురాంపురం గ్రామంలో ఉన్న ఆమె తల్లిదండ్రులు బొడ్డాపు గవరయ్య, లక్ష్మిలకు వారు ఇచ్చారు. దీంతో రాత్రే తల్లిదండ్రులు ఆసుపత్రికి చేరుకున్నారు. పూజకు మెరుగైన వైద్య సేవలకు గాను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు తెలుస్తుంది. అయితే ఆమె ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలని భావించిందో తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా ప్రిన్సిపాల్ కె.ప్రసన్నలక్ష్మి మాత్రం పూజ కాలుజారి పడిందని చెప్పడం కొసమెరుపు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని కోటబొమ్మాళి ఎస్ఐ మహ్మద్ అలీ శుక్రవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నందిగాం: కాపుతెంబూరు జంక్షన్ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నౌగాం పంచాయతీ హుకుంపేట గ్రామానికి చెందిన చిన్ని వెంకటేశ్వరరావు ద్విచక్రవాహనంపై కాపుతెంబూరు జంక్షన్ నుంచి టెక్కలి వైపు పెట్రోల్ బంకుకు వెళ్తుండగా పలాస నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడిని హైవేఅంబులెన్స్‌లో టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి రిఫర్ చేయగా కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ బి.ఢిల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీ

టెక్కలి: పాత జాతీయరహదారిలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. అర్చకుడు శుక్రవారం ఉదయం ఆలయం తెరిచేందుకు వెళ్లగా తలుపులు తీసి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కంచుగంట, హుండీలో నగదు, పూజా సామగ్రి చోరీకి గురైనట్టు గుర్తించి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి.. ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు.

పలాసపురంలో అగ్నిప్రమాదం


ఎగిసి పడుతున్న మంటలు

సోంపేట: పలాసపురం గ్రామంలో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఉదయం ఐదు గంటల సమయంలో సంక రామారావు ఇంటి నుంచి మంటలు చెలరేగాయి. వెనుక ఇంట్లో ఉన్న రామారావు గుర్తించి కేకలు పెట్టి బయటకు వచ్చాడు. ఇదే సమయంలో పక్కనే ఉన్న బెందాళం రామానుజం, బట్టి బైరాగి పశువుల షెడ్లకు నిప్పు అంటుకుంది. సమాచారం అందుకున్న సోంపేట ఫైర్ సిబ్బందికి తెలియజేయగా.. వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఎటువంటి ప్రాణ నష్టం లేకపోవడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

కారు దొంగ అరెస్టు

శ్రీకాకుళం క్రైం: నగరంలో కారు దొంగతనం చేసిన వ్యక్తి సింగుపురం వద్ద శ్రీకాకుళం రూరల్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే... కొత్తరోడ్డు సమీపంలో ఉన్న చక్రధర్ ఐటీఐ యజమాని యాళ్ల చక్రధర్ ఈ నెల 20వ తేదీ రాత్రి కళాశాల వద్ద కారును పార్కు చేసి, కారుకే తాళాలు వదిలేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన కాటగ సంతోష్ ఈ కారును దొంగిలించాడు. దీనిపై చక్రధర్ 21వ తేదీన రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ ఎస్ఐ వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో సింగుపురం గ్రామ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ఎస్ఐ వాహన తనిఖీలు చేస్తుండగా.. ఏపీ 39 బీటీ 0634 నెంబరు గల వాహనం ఎదురైంది. ఈ కారును ఆపేందుకు ఎస్ఐ తొలుత ప్రయత్నించగా, పోలీసులను తప్పించుకుని పారిపోయేందుకు కారులో ఉన్న సంతోష్ ప్రయత్నించాడు. సరిగ్గా సింగుపురం బ్రిడ్జి మీద పోలీసులు కారును అడ్డగించి, కారును దొంగిలించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. తాను చోరీకి పాల్పడినట్టు సంతోష్ అంగీకరించాడు. దీంతో ఎస్ఐ కారును స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టుకు అప్పగించారు.

నీటి ఇంజన్ల చోరీపై కేసు నమోదు

జలుమూరు: నీటి ఇంజన్లు చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు. మండలంలో పలుచోట్ల నీటి ఇంజన్లు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు కరకవలస గ్రామానికి చెందిన పేడాడ రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. తన నీటి ఇంజన్ వంశధార ప్రధాన ఎడమ కాలువ వద్ద సాగు నీటి కోసం అమర్చగా గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్టు ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి: సవర మర్రిపాడు గ్రామంలో డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటిలిజెన్స్ బృందాలు సారా తయారీ కేంద్రాలపై శుక్రవారం దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. మద్యం తయారీ, క్రయ, విక్రయాలపై పూర్తిస్థాయిలో నిఘా వేశామని, సారా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖర్, పలాస డీటీఎఫ్ సీఐ రామచంద్రకుమార్ హెచ్చరించారు.

ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి

కంచిలి: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎస్సీఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మర్రిపాటి పూర్ణ, ఎమ్మెల్యే అశోక్‌తో కలిసి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని విజయవాడలో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఖాళీల రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని కోరినట్టు తెలిపారు. వినతి పత్రం అందించారు. అలాగే బేడ, బుడగ జంగం విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని మండల టీడీపీ నాయకులు మంత్రి అచ్చెన్నాయుడుని విజయవాడ కార్యాలయంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి శుక్రవారం వినతి పత్రం అందించారు. మాదిన రామారావు, పిలక చినబాబు, టీవీ రమణ, మర్రిపాటి పూర్ణ, పూర్ణబిసోయి ఉన్నారు.

రాజకీయ తొలగింపులు ఆపాలి


విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అరసవల్లి: మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు రాజకీయ తొలగింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావుకు డీఈవో కార్యాలయం వద్ద శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మారినప్పుడు వంట కార్మికులను రాజకీయ కక్ష సాధింపు చర్యలతో తొలగించడం జరుగుతోందని తెలిపారు. బిల్లులు, వేతనాలు సకాలంలో రాకపోయినా సరే వడ్డీలకు అప్పుచేసి ఈ పథకాన్ని నడిపిస్తున్నామన్నారు. ఇప్పుడు ఇలా ఉద్యోగంలో నుంచి తొలగించడం అన్యాయమని వాపోయారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఉత్తర, కె.సుశీల, జి.పద్మావతి, బి.విజయ, ఆర్.లక్ష్మి, ఎం.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ వీరుల త్యాగాలు మరువలేనివి

- జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారిణి శైలజ


నరసన్నపేట: పోలీసు స్టేషన్ వద్ద విజయ్ దివస్‌లో పోలీసులు, యువత


అరసవల్లి: రక్తదానం చేస్తున్న యువత

అరసవల్లి: భరతజాతి చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించిన కార్గిల్ యుద్ధ విజయం దేశం యావత్తు జరుపుకునే ఒక పండుగ ఈ విజయ దివస్ అని జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎం.శైలజ అన్నారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మాజీ సైనికుల జాయింట్ ఏక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్గిల్ అమరవీరుల త్యాగాలు నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ డోల జగన్ మాట్లాడుతూ.. కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికుల వీర గాథలను నేటి యువతకు తెలియజెప్పాలని కోరారు. ఆనాటి యుద్ధంలో 527 మంది జవాన్లు దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి దేశభక్తిని, స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి స్వాతి, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి కూన ప్రమీల, యాక్షన్ కమిటీ ప్రతినిధులు పి.రామారావు, ఎం.శంకరనారాయణ, కలివరపు.సాయిరాం, ఎస్.నారాయణమూర్తి, ఎన్‌సీసీ అధికారి వై.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి వందలాది మాజీ సైనికులు తరలివచ్చి రక్తదానం చేసి వీర సైనికులకు నివాళులర్పించారు.

ఇచ్ఛాపురం పట్టణంలో..

ఇచ్ఛాపురం: కార్గిల్ విజయ్ దివస్ పట్టణంలో యూ కాంప్లెక్స్ సమీపంలో గల మాజీ సైనికోద్యోగుల కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేశ నాయకులు, వీర జవానుల చిత్రపటాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సైనికోద్యోగులు రామకృష్ణారెడ్డి, బీఎల్ నారాయన, డి.విశ్వనాథంరెడ్డి, యు.శంకర్, మహదేవ్, ఢిల్లీష్, దుర్గయ్య, జగన్నాథ్, చంద్రశేఖర్, తులసీదాస్ పాల్గొన్నారు.

నివగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో..

కొత్తూరు: నివగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. అమర వీరులకు నివాళులర్పించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారిశెల్లి రామరాజు మాట్లాడుతూ.. పాకిస్తాన్‌తో లక్షలాది మంది వీరోచితంగా పోరాడి చొరబాటుదారులు దేశంలోకి రాకుండా ఎదుర్కొన్నారని, ఈ పోరాటంలో అనేక మంది సైనికులు అశువులబాసారన్నారు. విద్యార్థులతో ర్యాలీ చేశారు. అనంతరం మాజీ సైనికుడు నిలురోతు ఆనందరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అతిథి కామర్స్ అధ్యాపకులు పి.ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ ఆవరణలో..

నరసన్నపేట: పట్టణంలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు చైతన్య భారతి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ వద్ద కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు. పాకిస్తాన్ దురాక్రమణపై ఎదురునిల్చి పోరాటం చేసిన భారతసైన్యం విజయసాధించిన రోజు అని, ఈ పోరాటంలో 527 మంది భారత సైనికులు వీరమరణం పొందారని చైతన్య భారతి కన్వీనర్ చింతు పాపారావు అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ తులసీరావు, అసిరినాయుడు, బోర ఎర్రంనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే రిటైర్డు ఆర్మీ ఉద్యోగులు సంక్షేమ భవనం వద్ద కార్గిల్ దివస్ వేడుకలను నిర్వహించారు

యువత రక్తదానం

కాశీబుగ్గ: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మాజీ సైనికుల సంక్షేమ సంఘం, పవనపుత్ర సంస్థ సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్లకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు బి.బారికి, ఫల్గుణరావు, సభ్యులు వైకుంఠరావు, బాబూరావు, సూర్యనారాయణ, తాతారావు, ఐఎం రావు, జిల్లా అధ్యక్షుడు గోరు వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: సెల్యూట్ చేస్తూ నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు


కొత్తూరు: మాజీ సైనికుడు ఆనందరావును సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది


కాశీబుగ్గ: రక్తదానం చేస్తున్న దృశ్యం

విచారణ కాదు.. న్యాయం చేయండి

- ఉద్యోగాల పేరుతో మోసపోయిన బాధితులు
- పంచాయతీ కార్యదర్శిపై కొనసాగిన విచారణ
- మా వాదన వినాలన్న మరికొందరు.. పట్టించుకోని అధికారులు

శ్రీకాకుళం క్రైం: ఉద్యోగం పేరుతో మోసపోయాయమని, విచారణతో కాలయాపన చేయకుండా న్యాయం చేయాలని బాధితులు అధికారులను వేడుకున్నారు. మందస మండలం లోహరిబంద గ్రామ పంచాయతీ కార్యదర్శి మన్నం సతీష్‌బాబుపై 'మీ కోసం'లో ఆరుగురు బాధితులు ఉద్యోగాల పేరుతో మోసపోయామని, న్యాయం చేయాలని అర్జీ పెట్టుకోవడంతో అతడిపై విచారణకు కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ సీఈవో డి.వెంకటేశ్వరరావు, డీపీవో కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సతీష్‌బాబును విచారించారు. సతీష్‌బాబు మోసాలపై ఫిర్యాదు చేసిన ఆరుగురితో పాటు శ్రీకాకుళం నగరానికి చెందిన సుమారు 30 మంది బాధితులు జిల్లా పరిషత్‌లో విచారణకు హాజరయ్యారు. ఈ విచారణలో బాధితులైన ప్రియానందం, ప్రవీణ్‌కుమార్, పి.నరేష్‌కుమార్, జి.గౌరీశంకర్, టి.లీలాసాయి కృష్ణలను డీపీవో, జడ్పీ సీఈవోలు విచారించారు. వీరిని ఉద్యోగాల పేరుతో సతీష్‌బాబు మోసం చేసినట్టు అధికారులు గుర్తించారు. దీనిపై సతీష్‌బాబు లిఖితపూర్వకంగా తాను ఉద్యోగాల పేరుతో ఈ ఆరుగురు నుంచి నగదు వసూలు చేశానని, వారికి నగదు తిరిగి ఇచ్చేస్తానని అంగీకరిస్తూ అధికారులకు రాసి ఇచ్చాడు. ఈ మేరకు సతీష్‌బాబు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకుని కలెక్టర్‌కు నివేదించనున్నారు.

ఫిర్యాదుదారులకే అవకాశంపై ఆందోళన

ఉద్యోగల పేరుతో మోసపోయమంటూ కలెక్టర్ నిర్వహించే 'మీ కోసం' కార్యక్రమంలో ఫిర్యాదు చేసిన ఆరుగురు బాధితులకే జడ్పీ కార్యాలయంలో విచారణ అవకాశం ఇవ్వడం తగదని, సతీష్‌బాబు మోసాల బారిన పడిన ఎందరో బాధితులు ఉన్నారని, వారిని కూడా విచారించి నివేదిక తీసుకోకపోవడం అన్యాయమని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం మీకోసంలో ఫిర్యాదు చేసిన ఆరుగురు బాధితుల వివరణ మాత్రమే అధికారులు తీసుకోగా సతీష్‌బాబు మోసాల బారిన పడిన సుమారు 30 మంది బాధితులు జడ్పీ కార్యాలయానికి శుక్రవారం ఉదయం 10.00 గంటలకు చేరుకున్నారు. అయితే అధికారులు ఆరుగురు బాధితులను తప్ప మరెవరీ ఘోషను వినకపోవడంతో బాధితులు ఆందోళన చేపట్టారు. ఇదే క్రమంలో మోసం చేసిన సతీష్‌బాబు అక్కడకు చేరుకోవడంతో మహిళా బాధితులు అతడి చొక్కా పట్టుకుని నిలదీశారు. ఇదిలా ఉంటే విచారణాధికారులు మాత్రం బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని, అప్పుడే వాంగ్మూలాన్ని నమోదు చేసి కలెక్టర్‌కు అందిస్తామని చెప్పడంతో వారంతా అసహనం వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటలకు జడ్పీ కార్యాలయంలో ప్రారంభమైన విచారణ రాత్రి 7.00 గంటల వరకు సాగింది. అయితే బాధితులు తాము ఎస్పీ కార్యాల యంలో ఫిర్యాదు చేశామని, తమకు విచారణలో అవకాశం కల్పించలేదని, ఉన్న ఆరుగురితో విచారణ జరిపించడం కన్నా, బాధితులందరికీ న్యాయం చేయాలని వారు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కోరారు.


విచారణలో పాల్గొన్న అధికారులు


నిరసన తెలుపుతున్న బాధితులు

తితలీ బాధితులకు పరిహారం ఇప్పించండి

- మంత్రి అచ్చెన్నాయుడిని కోరిన ఉద్దానం రైతులు


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కవిటి: తితలీ తుఫాన్‌లో నష్టపోయి పరిహారం అందని రైతులకు న్యాయం చేయాలని ఉద్దానం రైతులు, కవిటి మండల టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు విజయవాడలో శుక్రవారం మంత్రి కె.అచ్చెన్నాయుడును కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తితలీ తుఫాన్‌లో ఉద్దానం ప్రాంతం అతలాకుతలమై కొబ్బరి పంట నాశనమైందన్నారు. రైతులను ఆదుకోవాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కొబ్బరి చెట్టుకు రూ.1500 చొప్పున మూడు విడతలుగా అందించారన్నారు. అయితే వివిధ సాంకేతిక కారణాలు చూపి 6,612 మంది రైతులకు పరిహారం అందకుండా పోయింది. కొందరి రైతులకు అప్పుడు చెక్కులు అందినా బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమకాలేదన్నారు. అప్పటి నుంచి రైతులు తమ మొరను అధికారులు, నాయకులకు వివరిస్తూనే ఉన్నా పట్టించుకోలేదన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రెట్టింపు పరిహారం పేరిట రైతులకు పంపిణీ చేశామని చెప్పినా వీరికి అందలేదన్నారు. ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో చంద్రబాబు రైతులకు కొంత భరోసా ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆలోచన చేద్దామని చెప్పారని గుర్తుచేశారు. టీడీపీ నేతలు ఎస్వీ రమణ, పి.కృష్ణారావు, ఎల్.శ్రీను, ఎం.రామారావు, బి.విజయకృష్ణ, బి.రమేష్, ఎన్.పురుషోత్తం, పి.రాజు తదితరులు మంత్రిని కలిసి పరిస్థితిని వివరించారు.

కూర్మనాథుని హుండీ లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

గార: ప్రసిద్ధ శ్రీకూర్మనాథుని ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. 80 రోజులకు రూ.12.23 లక్షలు ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో గురునాథరావు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి ఈవో టీపీ మనస్విని, ఆలయ సిబ్బంది నర్సుబాబు, అర్చకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ఆమదాలవలస: నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా నిలిచిపోయిన సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ ముఖ్యమంత్రి చం ద్రబాబును కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాలకు హాజరైన రవికుమార్ సీఎం చంద్రబాబును కలిసి వంశధార, నాగావళి నదుల అనుసంధాన పనులతో పాటు రెల్లిగెడ్డ పనుల ఆవశ్యకతను వివరించి రైతులను ఆదుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని పలు రహదారులు అధ్వాన్న స్థితిన వివరించారు. ముఖ్యంగా శ్రీకాకుళం-ఆమదాలవలస ప్రధాన రహదారి దీర్ఘకాలిక సమస్యగా ఉన్నందన్నారు. ప్రభుత్వం ఐటీఐ, ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయాలని కోరారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

ఆమదాలవలస: ఆడపిల్లల పట్ల అసభ్యకరంగా ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ దివాకర్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో ఆటో డ్రైవర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే లైసెన్స్ క్యాన్సిల్ చేయడంతోపాటు జైలుకు పంపిస్తామన్నారు. గంజాయి రవాణాపై ఎటువంటి సమాచారం ఉన్నా తెలియజేయాలన్నారు. ఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి


శాసన సభలో మాట్లాడుతున్న ఎన్ఈఆర్

రణస్థలం: ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, మందులు అందుబాటులో ఉంచాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం జరిగిన శాసనసభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు అభివృద్ధికి నోచుకోలేదని, నిరుపేదలకు మెరుగైన వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కనీస వసతులు లేకపోవడం దారుణమని సభ దృష్టికి తీసుకెళ్లారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి


సమస్యలు వివరిస్తున్న నాయకులు

పొందూరు: పంచాయతీల్లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని మండల టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచించారు. అమరావతిలో రవికుమార్ చాంబర్‌లో మండల టీడీపీ అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కలిసి మండల సమస్యలను వివరించారు. ముఖ్యంగా మేజరు పంచాయతీ పొందూరులో రోడ్లు, కాలువలు సమస్యలతో పాటు తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. రవికుమార్‌ను కలిసినవారిలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కర్, పట్టణ అధ్యక్షుడు ఎ.చినరంగ, చేనేత సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడు కాలెపు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పీఈటీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కవిటి: ఉద్యోగ భద్రత కల్పించాలని వ్యాయామ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈమేరకు నౌపడలో జరిగిన సమావేశంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు ఎంవీ రమణ ఆధ్వర్యంలో డిప్యూటీ డీఈవో విలియమ్‌కు శుక్రవారం వినతి పత్రాన్ని అందించారు. సర్వశిక్షలో ఉన్న తమకు డీఎస్సీలో అవకాశం కల్పించి న్యాయం చేయాలని వారు కోరారు. ఉద్యోగ భద్రత కల్పిస్తూ న్యాయం చేసేలా మంత్రి ఎన్.లోకేష్ దృష్టికి తీసుకువెళ్లాలని వారంతా కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

బూర్జ: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా డ్రమ్ సీడర్ ద్వారా స్వదేశీ విత్తనాలు చల్లడాన్ని తుడ్డలి గ్రామంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ రేవతి శుక్రవారం ప్రారంభించారు. ఈ విధానంలో రైతులు అనేక లాభాలు పొందవచ్చునన్నారు. ఏడీ రాజగోపాల్, బూర్జ ఏవో శ్రీనివాసరావు, సచివాలయ వ్యవసాయాధికారి సాయితేజ, తుడ్డలి గ్రామ సర్పంచ్ ప్రతినిధి అంపిలి గణపతిరావు పాల్గొన్నారు.

ఉద్యాన వన పంటలు పరిశీలన

గార: తూలుగు, నిజామాబాద్, వత్సవలస గ్రామాల్లో ఉపాధి పథకం ద్వారా సాగుచేస్తున్న ఉద్యానవన పంటలను శుక్రవారం డ్వామా పీడీ చిట్టిరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఏపీవో సంధ్యారాణి, జేఈ నారన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రత్తకన్నలో ఆధార్ డ్రైవ్

ఇచ్ఛాపురం: మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆధార్ డ్రైవ్ కార్యక్రమం కొనసాగుతుంది. శుక్రవారం రత్తకన్న సచివాలయంలో ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేపట్టగా విశేష స్పందన లభించింది. చంటి పిల్లలతో తల్లులు సచివాలయానికి చేరుకుని ఆధార్ నమోదు చేయించుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ విజయ్‌కుమార్, సిబ్బంది, పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం


కృష్ణవేణి (ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఎల్‌బీఎస్ కాలనీకి చెందిన పెదపెంకి కృష్ణవేణి (81) శుక్రవారం మృతిచెందారు. ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. దీంతో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావును సంప్రదించారు. ఆయన మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రానికి సమాచారం ఇచ్చారు. దీంతో ఐ టెక్నీషియన్ సుజాత, సహాయకులు, బి.జగదీష్ చేరుకుని కృష్ణవేణి కార్నియాలు సేకరించారు. వాటిని విశాఖలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందచేశారు. అనంతరం ఆమె మృతదేహానికి నివాళర్పించి, దాత కుమారులు పి.నాగేశ్వరరావు, పి.రవీంద్రకుమార్, పి.శ్రీరామ్ కుమార్, కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావు, సెక్రటరీ బి.మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గా శ్రీనివాస్ అభినందించారు. ప్రస్తుత కాలంలో నేత్రదానంపై అవగాహన, చైతన్యం ప్రజల్లో బాగా పెరుగుతుందన్నారు. నేత్రదానం ద్వారా మరొకరికి ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం కలుగుతుందని, అంధత్వ రహిత సమాజ స్థాపనకు యువత, ప్రజలు కృషి చేయాలన్నారు. నేత్రదానం చేయాలనుకునే వారు 78426 99321 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

డైరెక్టర్ల నియామకం

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో సైకలాజికల్ అసెస్మెంట్ అండ్ కౌన్సెలింగ్ డైరెక్టర్‌గా వర్సిటీ విద్యా విభాగం అధ్యాపకురాలు డాక్టర్ జేఎల్ సంధ్యారాణిని నియమించారు. అలాగే సావిత్రి బాయి పూలే మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా వర్సిటీ తెలుగు విభాగం అధ్యాపకురాలు డాక్టర్ యు.శాంతి నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ వీసీ కేఆర్ రజని శుక్రవారం వీరికి నియామక ఉత్తర్వులు అందజేశారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు

బూర్జ: మైనర్లు ద్విచక్ర వాహనాలను నడపవద్దని ఏఎస్ఐ ఎంవీ రమణ అన్నారు. మండలంలోని పాలవలస జడ్పీ హైస్కూల్‌లో వాహన చట్టాలు, ఈవ్‌టీజింగ్ చేస్తే చట్టపరమైన చర్యలపై విద్యార్థులకు అవగాహన శుక్రవారం కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై చర్యలు తీసుకుంటామని, వాహనాలను సీజ్ చేస్తామన్నారు. విద్యార్థులు ఈవ్‌టీజింగ్ పాల్పడితే కేసులు తప్పవన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ప్రసన్న, మహిళా పోలీస్ జయంతి, హైస్కూల్ హెచ్ఎం ప్రతాప్ రుద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **గార:** మైనర్లు వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమని ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ హై స్కూల్‌లో మైనర్లు వాహనాలు నడపటం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ విషయంలో తల్లితండ్రులు కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్ల లోపు వయస్సు ఉండే వారికి వాహనాలు ఇవ్వొద్దని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాకంబరిగా సంతోషిమాత



శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో ఉన్న సంతోషిమాత ఆలయంలో అమ్మవారిని ఆలయ అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ దేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.